క్లుప్తంగా

ఫర్టిలైజర్ షాపుల్లో తనిఖీ



ఖానాపురం : మండలంలోని పలు ఫర్టిలైజర్ షాపుల్లో ఎస్సై రఘుపతి, ఏఓ శ్రీనివాస్ ఆధ్వర్యంలో శుక్రవారం తనిఖీ చేపట్టారు. రికార్డులను పరిశీలించారు. ఎరువులు, పురుగు మందుల గడువు, ఇతరత్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్సై, ఏఓ మాట్లాడారు. డీలర్లు రైతులకు నాణ్యమైన ఉత్పత్తులనే విక్రయించాలని చెప్పారు. కొనుగోలు చేసిన ఎరువులు, పురుగు మందులకు సంబంధించి రైతులకు తప్పనిసరిగా బిల్లు ఇవ్వాలన్నారు. గడువు మీరిన ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తెలిపారు.

జేబీఎం రాష్ట్ర కోఆర్డినేటర్‌గా ప్రమోద్




పర్వతగిరి : జవహర్ బాల్ మంచ్ (జేబీఎం) రాష్ట్ర కోఆర్డినేటర్‌గా మండలంలోని కొంకపాకకు చెందిన బొక్కల ప్రమోద్ నియమితులయ్యారు. ఈ మేరకు మంచ్ జాతీయ విభాగం ఉత్తర్వులు జారీ చేయడంతో జాతీయ చైర్మన్ డాక్టర్ జీవీ.హరి జీ, తెలంగాణ జాతీయ సమన్వయకర్త, ఇన్‌చార్జి శామ్యూల్ జార్జ్, తెలంగాణ రాష్ట్ర చైర్మన్ రుషికేష్‌రెడ్డి నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల కేంద్రంలో ప్రమోద్ విలేకరులతో శుక్రవారం మాట్లాడారు. తనను నియమించిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

మొరం పోయించి చదును



నల్లబెల్లి : కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణలోని బురదమయమైన మైదానాన్ని ఓ వ్యక్తి సొంత డబ్బుతో చదును చేయించి ఔదార్యం చాటుకున్నాడు. వివరాలిలా.. మండలంలోని నందిగామలోని ప్రభుత్వ హైస్కూల్‌లోని మైదానం కొద్దిరోజులుగా కురుస్తున్న వర్షాలకు బురదమయం అయ్యింది. దీంతో విద్యార్థులు ఇబ్బంది పడుతుండడాన్ని గమనించి పాఠశాల 10, 9వ తరగతి విద్యార్థులు మధుప్రియ, సింధూజ తండ్రి అమ్మ కుమారస్వామి స్పందించాడు. సుమారు రూ.10 వేలు వెచ్చించి మైదానంలో మొరం పోయించి చదును చేయించాడు. కుమారస్వామి చొరవను హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు యాకూబ్‌రెడ్డి, కిషన్ అభినందించారు.

వివేకానందుడికి నివాళి



నర్సంపేట : చెన్నారావుపేటలో బీఆర్ఎస్, సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, జాగృతి స్కూల్ ఆధ్వర్యంలో స్వామి వివేకానంద వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి, చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల ఇన్‌చార్జ్ బాల్నె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ జున్నూతుల రాంరెడ్డి, తదితరులు మాట్లాడారు. సమాజ ఉన్నతికి స్వామి వివేకానంద అందించిన సేవలను స్మరించారు. కార్యక్రమాల్లో జెడ్పీ మాజీ కోఆప్షన్ సభ్యుడు మహ్మద్ రఫీ, మాజీ సర్పంచ్ కుండె మల్లయ్య, నాయకులు బానోతు గణేశ్, హంస విజయ రామరాజు, కందకట్ల సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు అరెస్ట్

నర్సంపేట రూరల్ : చలో సెక్రటేరియట్ కార్యక్రమ నేపథ్యంలో బీఆర్ఎస్వీ పట్టణ కమిటీ అధ్యక్షుడు దేవోజు హేమంత్‌ను పోలీసులు శుక్రవారం తెల్లవారుజామున ముందస్తుగా అరెస్ట్ చేసి తదనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై వదిలేశారు. ఈ సందర్భంగా హేమంత్ మాట్లాడారు. అరెస్టులను ఖండించారు. ఉద్యోగ నియామకాలు చేపట్టాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

9న మహాధర్నాను విజయవంతం చేయాలి

గీసుకొండ : హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్‌లో ఈనెల 9న తలపెట్టిన ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల మహాధర్నాను విజయవంతం చేయాలని ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ ఖన్నా శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. దేశవ్యాప్తంగా నిర్వహించనున్న సార్వత్రిక సమ్మెలో భాగంగా ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు 9న ఉదయం 10 గంటలకు ఇందిరా పార్క్‌కు చేరుకుని ధర్నాలో పాల్గొనాలని కోరారు.

‘ఎఫ్‌ఆర్‌ఎస్’తో అక్రమాలకు చెక్

● అంగన్‌వాడీ సరుకులు పక్కదారి పట్టకుండా..



యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ సునీత

నల్లబెల్లి : అంగన్‌వాడీ కేంద్రాల్లో లబ్ధిదారులకు ఇచ్చే సరుకులు పక్కదారి పట్టకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈనెల నుంచి ఆయా కేంద్రాల్లో ఫేషియల్ రికగ్నైజేషన్ సిస్టమ్ ద్వారా సరుకులు అందించనుంది. ఇప్పటికే గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ముఖచిత్రంతో కూడిన వివరాలను అంగన్‌వాడీ టీచర్లు మొబైల్‌లో ట్రాకర్ యాప్‌లో నమోదు చేశారు. ప్రస్తుతం ఆధార్ అనుసంధానం చేస్తున్నారు. ఈ ప్రక్రియ పూర్తి అవుతోంది. త్వరలో ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు కానుంది. లబ్ధిదారులందరికీ ఎఫ్‌ఆర్‌ఎస్ అమలు చేయడానికి మహిళ శిశు సంక్షేమ శాఖ నుంచి ఆదేశాలు రావడంతో జిల్లా అధికారులు కార్యాచరణ చేపట్టారు.

ఓటీపీ నమోదుతోనే..

ఇప్పటివరకు మాన్యువల్‌గా సరుకులు అందించి పోషణ్ అభియాన్ ట్రాకర్ యాప్‌లో నమోదు చేసే పరిస్థితి ఉండగా ఇక నుంచి మొదటి లబ్ధిదారు ఫొటో అప్‌లోడ్ చేస్తారు. అనంతరం లబ్ధిదారు మొబైల్‌కు వచ్చే ఓటీపీని పోషణ్ అభియాన్ ట్రాకర్‌లో నమోదు చేస్తే ప్రక్రియ పూర్తి అవుతుంది. అనంతరమే సరుకులు అందిస్తారు. ఈ యాప్‌లోనే కొత్తగా ఫేస్ రికగ్నిషన్ సిస్టమ్ పొందుపర్చారు. ఇందులోనే వివరాలు నిక్షిప్తం చేస్తారు. ఈ మేరకు అంగన్‌వాడీ టీచర్లకు క్లస్టర్ల వారీగా శిక్షణ ఇచ్చారు.

అక్రమాలకు చెక్ పెట్టేలా..

అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులు, బాలింతలు, గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్న విషయం తెలిసిందే. మండలంలో 57 అంగన్‌వాడీ కేంద్రాల్లో 231 మంది గర్భిణులు, 227 మంది బాలింతలు, 2208 మంది ఆరేళ్లలోపు వయస్కులైన చిన్నారులున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా పౌష్టికాహారం పక్కదారి పడుతోందన్న విమర్శలున్నాయి. లబ్ధిదారులకు సరుకులు సక్రమంగా పంపిణీ చేయకపోవడం, కొందరు కేంద్రానికి రాకపోయినా వచ్చినట్లు నమోదు చేయడం వంటి పరిణామాలు చోటుచేసుకున్న ఘటనలూ అధికారుల తనిఖీల్లో పలుమార్లు బయటపడ్డాయి. ఈ క్రమంలోనే అక్రమాలకు చెక్ పెట్టేలా కేంద్ర ప్రభుత్వం ప్రణాళిక రూపొందించింది. ఈ విధానంలో అంగన్‌వాడీ కేంద్రానికి వస్తేనే ఎఫ్‌ఆర్‌ఎస్ ద్వారా లబ్ధిదారుల హాజరు నమోదు కానుంది. నెలలో ఎంతమంది లబ్ధిదారులు హాజరయ్యారు?, ఎందరికి సరుకులు పంపిణీ చేశారు?, నిల్వ, తదితర వివరాలు పారదర్శకంగా తెలుస్తాయి.

త్వరలోనే అమలు



కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఎఫ్‌ఆర్‌ఎస్ ప్రక్రియ కొనసాగుతోంది. లబ్ధిదారుల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశాం. ప్రస్తుతం లబ్ధిదారుల వివరాలను ఆధార్‌తో అనుసంధానం చేస్తున్నాం. ఆధార్ అనుసంధానం పూర్తి కాగానే నూతన ప్రక్రియ అమలు కానుంది. తద్వారా సరుకులు పక్కదారి పట్టకుండా నిరోధించే అవకాశం ఉంది.

– అరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్

అభివృద్ధిని ఓర్వలేకే ఆరోపణలు

● టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రంజిత్‌రెడ్డి

నెక్కొండ : నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని ఓర్వలేకనే స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డిపై బీఆర్ఎస్ నాయకులు ఆరోపణలు చేస్తున్నారని టీపీసీసీ సభ్యుడు సొంటిరెడ్డి రంజిత్‌రెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలోని ఆర్ అండ్ బీ గెస్ట్‌హౌస్‌లో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బక్కి అశోక్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన మాటలకు పరిమితం కాగా కాంగ్రెస్ చేతల ప్రభుత్వంగా ప్రజల హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకుందని చెప్పారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఎన్నికల లబ్ధి కోసమే తీసుకొచ్చిన జీఓలను అడ్డుపెట్టుకొని ప్రజలను భ్రమింపజేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డికి గుణపాఠం చెప్పారని తెలిపారు. ఇప్పటికీ ఆ జీఓలతో సుదర్శన్‌రెడ్డి మళ్లీ మోసపూరిత వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మెజార్టీ స్థానాల్లో విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీశ్‌రెడ్డి, పట్టణ కమిటీ అధ్యక్షుడు పెండ్యాల హరిప్రసాద్, రామాలయ కమిటీ చైర్మన్ కొమ్మారెడ్డి సుధాకర్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సింగం ప్రశాంత్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు రావుల మహిపాల్ రెడ్డి, బొమ్మెరబోయిన రమేశ్, సోషల్ మీడియా కోఆర్డినేటర్ తిరుపతిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో విద్యార్థి దశ ప్రధానం



అవగాహన కల్పిస్తున్న కళా బృందం సభ్యులు

● ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి

దుగ్గొండి : జీవితంలో విద్యార్థి దశ ప్రధానమని ఎస్సై రావుల రణధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మండలంలోని గిర్నిబావిలోని మహాత్మ జ్యోతిబా పూలే (ఎంజేపీ) గురుకుల విద్యాలయలో పోలీస్ జాగృతి కళా బృందం ఆధ్వర్యంలో సైబర్ నేరాలు, గంజాయి, డ్రగ్స్, రోడ్డు ప్రమాదాలు, షీ టీమ్స్, తదితరాలపై శుక్రవారం నిర్వహించిన కళా ప్రదర్శన సందర్భంగా ఆయన మాట్లాడారు. సమాజంలో డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాలు యువతను నిర్వీర్యం చేస్తున్నాయని ఆందోళన వెలిబుచ్చారు. మంచి, చెడులపై విద్యార్థి దశలోనే అవగాహన పెంచుకుంటే చదువుల్లోనే కాకుండా ఆటపాటల్లోనూ, ఇతర రంగాల్లోనూ రాణించి ఉత్తమ పౌరులుగా ఎదుగుతారని చెప్పారు. విద్యార్థులు డ్రగ్స్ వంటి మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరాల పట్ల చైతన్యవంతం కావాలని సూచించారు. క్రమశిక్షణతో చదువుకుని ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో విద్యాలయ ప్రిన్సిపాల్ ఓదెల మల్లయ్య, బృందం ఇన్‌చార్జ్, ఏఎస్సై నాగమణితోపాటు సభ్యులు విలయం, రత్నయ్య, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్, విక్రమ్, రాజు, నారాయణ, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో పోరాడాలి



నర్సంపేట : నివాళులర్పిస్తున్న సీపీఎం నాయకులు

నర్సంపేట/నల్లబెల్లి : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య స్ఫూర్తితో సమస్యలపై ప్రజలు పోరాడాలని సీపీఎం, సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా మాస్‌లైన్, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, బీసీ హక్కుల సాధన సమితి నాయకులు పిలుపునిచ్చారు. పలు పార్టీలు, సంఘాల ఆధ్వర్యంలో జిల్లాలోని నర్సంపేట, నల్లబెల్లి మండలాల్లో దొడ్డి కొమురయ్య వర్ధంతి శుక్రవారం నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సదరు పార్టీలు, సంఘాల నాయకులు ఇసంపెల్లి బాబు, భూక్య సమ్మయ్య, అడ్డూరి రాజు, ఆబోతు రాజు, చింతకింది కుమారస్వామి, తదితరులు మాట్లాడారు. కొమురయ్య ఫ్యూడల్ వ్యవస్థపై పోరాడారని చెప్పారు. బూర్జువా పాలకులు అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై కొమురయ్య స్ఫూర్తితో ఉద్యమాలు నిర్మించాలని శ్రేణులకు సూచించారు. కార్యక్రమాల్లో నాయకులు బుర్రి ఆంజనేయులు, నమిండ్ల స్వామి, జిల్లా ఉపాధ్యక్షులు బోళ్ల సాంబయ్య, పుచ్చకాయల నర్సింహారెడ్డి, లక్క రాజు, కత్తుల కొమురయ్య, భానోతు జవహర్‌లాల్, మచ్చిక రాజు, మధ్యబోయిన రమేశ్, పెద్దబోయిన రాజన్న, బాషబోయిన సమ్మయ్య, సదయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లను త్వరగా పూర్తి చేయాలి



పర్వతగిరి : ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరగా పూర్తి చేయాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ శంకర్ నాయక్ సూచించారు. మండలంలోని చింతనెక్కొండలో పలు ఇళ్ల నిర్మాణాలను శుక్రవారం ఆయన పరిశీలించి మాట్లాడారు. నిర్మాణంలో ప్రభుత్వ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని చెప్పారు. లబ్ధిదారులకు దశలవారీగా బిల్లులు మంజూరు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో జీపీ కార్యదర్శి సరిత, ఈసీ రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

నూతన ఓటరు నమోదు, సవరణలపై అవగాహన



ఖానాపురం : ఓటరు నమోదు, సవరణలపై మండల కేంద్రంలోని హైస్కూల్‌లో బూత్ లెవల్ ఆఫీసర్లకు (బీఎల్ఓ)లకు శుక్రవారం అవగాహనా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ రమేశ్ మాట్లాడారు. ఈనెల 1 నాటికి 18 ఏళ్లు నిండిన యువతకు ఓటు నమోదు చేయాలని, ఇంటింటికీ తిరిగి మృతి చెందిన, వివాహం జరిగి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారి ఓటును జాబితా నుంచి తొలగించాలని చెప్పారు. ఓటరు జాబితాలోని తప్పొప్పులను సవరించాలన్నారు. సమావేశంలో ఏఆర్ఐ స్వామి, బీఎల్ఓలు పాల్గొన్నారు.

గోరింట సంబురాలు

గీసుకొండ : మండల కేంద్రంలో ఆర్యవైశ్య సంఘం మహిళా విభాగం జిల్లా, మండల కమిటీల ఆధ్వర్యంలో మహిళలు శుక్రవారం ఆషాడ మాస గోరింటాకు సంబురాలు నిర్వహించారు. అరచేతుల్లో గోరింటాకు పెట్టుకుని సందడి చేశారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు ఇమ్మడి శ్యాంబాబు, వాసవీ కన్యకా పరమేశ్వరి కమిటీ అధ్యక్షుడు కొడకండ్ల భద్రయ్య, జిల్లా మహాసభ అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, ఆర్యవైశ్య మహిళా విభాగం మండల అధ్యక్షురాలు ఇమ్మడి సుజాత, కార్యదర్శి స్వరూప, కోశాధికారి కొడకండ్ల వరలక్ష్మి, ఉపాధ్యక్షురాలు రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం

నర్సంపేట రూరల్ : నర్సంపేట ఎంఆర్సీలో ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పని చేస్తున్న కంప్యూటర్ ఆపరేటర్ శ్రావణ్‌కుమార్‌కు అతడి తండ్రి కుమారస్వామి ఇటీవల మృతి చెందిన క్రమంలో డీటీఎఫ్ నాయకులు శుక్రవారం రూ.10 వేల సాయం అందజేశారు. తొలుత కుమారస్వామి చిత్రపటానికి ఎంఈఓ సారయ్య, నాయకులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఫెడరేషన్ జిల్లా ఉపాధ్యక్షుడు దార్ల రవీందర్, రాష్ట్ర కౌన్సిలర్ కూనమల్ల కొమ్మాలు, మండల అధ్యక్షుడు సర్దార్, మండల ప్రధాన కార్యదర్శి కొర్ర రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలో అభివృద్ధి శూన్యం



సమావేశంలో మాట్లాడుతున్న యాదగిరి

● బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జ్ యాదగిరి

వర్ధన్నపేట : కాంగ్రెస్ హయాంలో చేసిన అభివృద్ధి శూన్యమని బీఆర్ఎస్ వర్ధన్నపేట నియోజకవర్గ స్థానిక సంస్థల ఎన్నికల ఇన్‌చార్జ్ చింతల యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి అన్నారు. మండలంలోని ఇల్లంద ఎంపీటీసీ స్థానం పరిధిలోని ముఖ్యనాయకులు, కార్యకర్తలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలోనే అభివృద్ధి జరిగిందని చెప్పారు. పేదలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక మోసపూరిత పాలన సాగుతోందన్నారు. హామీలు నెరవేర్చలేక ప్రతిపక్షాలపై చౌకబారు వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. సమావేశంలో మాజీ ఎంపీపీ అన్నమనేని అప్పారావు, మాజీ జెడ్పీటీసీ భిక్షపతి, మాజీ ఆత్మ చైర్మన్ గోపాల్‌రావు, మాజీ మార్కెట్ చైర్మన్ సంపత్‌రెడ్డి, మాజీ దేవస్థానం చైర్మన్ వేణుగోపాల్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో లబ్ధి కోసమే శంకుస్థాపనలు

● బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు సారంగపాణి



సమావేశంలో మాట్లాడుతున్న సారంగపాణి

నల్లబెల్లి : స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి కోసమే ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి రోడ్లు, ఇతర అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్నారని బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బానోత్ సారంగపాణి అన్నారు. మండల కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సారంగపాణి మాట్లాడారు. బీఆర్ఎస్ హయాంలో నాటి ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధి కోసం విజన్‌తో పని చేయగా ప్రస్తుత ఎమ్మెల్యే మాధవరెడ్డి అభివృద్ధిని అడ్డుకుంటున్నారని తెలిపారు. బీటీ రోడ్ల పేరుతో చేపట్టిన శంకుస్థాపనల నిధుల మంజూరు వివరాలను, గత ప్రభుత్వం మంజూరు చేసిన అభివృద్ధి పనులను వెంటనే చేపట్టి పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పీఏసీఎస్ చైర్మన్ చెట్టుపల్లి మురళీధర్, మాజీ ఎంపీపీ కక్కెర్ల శ్రీనివాస్ గౌడ్, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు నానబోయిన రాజారాం, ఇంగ్లీ శివాజీ, మామిండ్ల మోహన్‌రెడ్డి, పాండవుల రాంబాబు, నాగెల్లి శ్రీనివాస్, భూస సదయ్య, గండు శ్రీధర్, పాడేటి ప్రకాశ్, వెనుకతాళ్ల రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

● బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు యువరాజు

నర్సంపేట : ఈనెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని బీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె యువరాజు కోరారు. తెలంగాణ గ్రామీణ ఆశా కార్యకర్తల సంఘం (బీఆర్‌టీయూ అనుబంధం) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డీఎంహెచ్ఓ సాంబశివరావుకు శుక్రవారం సమ్మె నోటీస్ అందజేశారు. ఈ సందర్భంగా యువరాజు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. ఆశా కార్యకర్తలకు రూ.18 వేల కనీస వేతనం ఇవ్వాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సమ్మెలో ఆశా వర్కర్లు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షురాలు కల్వల లలిత, జిల్లా కార్యదర్శి సంధ్య, నాయకులు అనిత, షామా, రమ, సరిత, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉన్నతే ధ్యేయం

నర్సంపేట రూరల్ : విద్యార్థుల ఉన్నతే ధ్యేయంగా శిక్షణా శిబిరాలు నిర్వహిస్తున్నట్లు బాలాజీ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎ.రాజేంద్రప్రసాద్‌రెడ్డి తెలిపారు. నర్సంపేట మండలంలోని లక్నెపల్లి గ్రామ శివారులోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెషిన్ లెర్నింగ్, టాస్క్ సంయుక్త ఆధ్వర్యంలో 'డెవలప్‌మెంట్ యూసింగ్ జావా స్క్రిప్ట్' అంశంపై ఏర్పాటు చేసిన ఐదు రోజుల శిక్షణా శిబిరం శుక్రవారం ముగిసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా రాజేంద్రప్రసాద్‌రెడ్డి హాజరై మాట్లాడారు. ప్రస్తుత కంప్యూటింగ్ యుగంలో విద్యార్థులు అన్ని రకాల ప్రోగ్రామింగ్ టెక్నాలజీపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. తద్వారా పోటీని తట్టుకుని ఎదగాలని చెప్పారు. సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ హరిహరన్, డీన్ డాక్టర్ నారాయణ, ఏఓ సురేశ్, కోఆర్డినేటర్ రాజు తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకం



ఖానాపురం : థీమోపాస్ పిచికారీ చేయిస్తున్న వైద్యురాలు, సిబ్బంది

● పల్లె దవాఖానా వైద్యురాలు కల్పన

ఖానాపురం : వర్షాకాలం ప్రారంభమైన క్రమంలో సీజనల్ వ్యాధుల బారి నుంచి కాపాడుకోవడంలో వ్యక్తిగత, పరిసరాల శుభ్రత కీలకమని మండలంలోని కొత్తూరు పల్లె దవాఖానా వైద్యురాలు కల్పన స్పష్టం చేశారు. ఆ గ్రామంలో మంగళవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు చేసి మందులు అందజేశారు. డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిన వ్యక్తి ఇంటి చుట్టూ థీమోపాస్ పిచికారీ చేయించారు. ఈ సందర్భంగా డాక్టర్ కల్పన మాట్లాడారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ రాజయ్య, సూపర్‌వైజర్ దామోదర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి స్రవంతి, భాస్కర్, సిబ్బంది వెంకటమ్మ, సులోచన, కారోబార్ యాకయ్య, తదితరులుల పాల్గొన్నారు.



వర్ధన్నపేట : పట్టణంలోని 3వ వార్డులో..

వర్ధన్నపేట : పట్టణంలోని 3వ వార్డులో క్లస్టర్ హెల్త్ సెంటర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. పలువురికి వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇళ్లల్లో నీటి నిల్వలను పారబోయించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ నేహా ఫాతిమా మాట్లాడారు. మంగళ, శుక్రవారాల్లో డ్రైడే పాటించాలన్నారు. ఇళ్లల్లోని నీటి నిల్వలను తొలగించి శుభ్రం చేసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు అరుణ, అనిత, ఆశ వర్కర్లు భాగ్య, అనసూయ, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

‘సఖి’ సేవలను వినియోగించుకోండి

● కేస్ వర్కర్ తిరుమల



సమావేశంలో మాట్లాడుతున్న తిరుమల

నెక్కొండ : సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలను బాధిత మహిళలు, బాలికలు వినియోగించుకోవాలని కేస్ వర్కర్ తిరుమల కోరారు. మండలంలోని సాయిరెడ్డిపల్లిలో, నెక్కొండ మోడల్ స్కూల్‌లో శుక్రవారం నిర్వహించినఅవగాహన సదస్సులకు ఆమె హాజరై మాట్లాడారు. దేశం శాస్త్ర, సాంకేతిక రంగాల్లో ఎంతగానో దూసుకుపోతున్నప్పటికీ సమాజంలో మహిళలు అనేక సమస్యలతో సతమతమవుతూనే ఉన్నారని తెలిపారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నా బాధలు తప్పడం లేదన్నారు. మహిళలు, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి కేంద్రాలు ఏర్పాటు చేసి ఉచితంగా అనేక సేవలు అందిస్తున్నాయని చెప్పారు. గృహహింస, లైంగిక వేధింపులు, ఇతర సమస్యలు ఎదుర్కొంటున్న మహిళలు సఖి కేంద్రాల్లో లభిస్తున్న సేవలపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. బాధిత మహిళలకు పోలీస్, న్యాయ, వైద్య సాయంతోపాటు తాత్కాలిక వసతి కల్పిస్తామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాని మహిళలు 181 నంబర్‌కు ఫోన్ చేసి సాయం పొందాలని కోరారు. సమావేశంలో ఉమెన్ హబ్ కోఆర్డినేటర్ పావని, వీఓఏ ఉమ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని ఆత్మహత్యపై విచారణ చేపట్టాలి

పర్వతగిరి : హనుమకొండ జిల్లాలోని పరకాల సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదో తరగతి విద్యార్థిని శ్రావణి ఆత్మహత్య చేసుకుని మృతి చెందిన ఘటనపై విచారణ చేపట్టాలని స్వేరోస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కందికట్ల ప్రవీణ్, నాయకులు గారె జయరాజ్, జంగిలి యాకయ్య డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఉపాధ్యాయుల వేధింపులతోనే శ్రావణి ఆత్మహత్య చేసుకుందని ఆమె తండ్రి చేసిన ఫిర్యాదు నేపథ్యంలో బాధ్యులను గుర్తించి కఠినంగా శిక్షించాలన్నారు. బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి జన్మదిన వేడుకలు

వర్ధన్నపేట : పట్టణంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు జన్మదిన వేడుకలను బీఆర్ఎస్ నాయకులు నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్‌లో కేక్ కట్ చేసి బాణాసంచా కాల్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, పట్టణ కమిటీ అధ్యక్షుడు గోధుమల మధు, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఎర్రబెల్లి రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ మనోజ్‌కుమార్, మండల ఎన్నికల ఇన్‌చార్జ్ జి.రమేశ్, బుద్దె వెంకన్న, మాజీ జెడ్పీటీసీ లూనావత్ పంతులు, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్, బీఆర్ఎస్ మండల కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో టపాసులు పేల్చారు. ప్రభుత్వ ఆస్పత్రిలో పండ్లు పంపిణీ చేశారు. యూత్ మండల అధ్యక్షుడు అశోక్ ఆధ్వర్యంలో వృద్ధులు, ప్రయాణికులకు బిర్యానీ ప్యాకెట్లు అందజేశారు. కార్యక్రమాల్లో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నర్సింహనాయక్, నాయకులు అనిమిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.